# అపూర్వ రహస్యం

'అమరేంద్ర'

"వచ్చావా మళ్లీ! ఏమిటి సంగతి?"

అని ఆశ్చర్యంగా అడిగాడు కనుబొమలు ఎగరేస్తూ అధికారి రామారావు. పిడలు కనపడేట్లు పాలిష్ చేసిన బూట్లూ, క్రాస్‌బెల్టూ, బంగారప్పు మెరుపులు విసురుతున్న గుండీలూ ఆయన హోదాను చాటుతున్నాయి. అంత దూరంనుంచే కొయ్యబొమ్మల్లాగా నిలబడిపోయి సలాం చేసిన జవాన్ల పిల్లుల్లాగా పక్కకి తొలగిపోవటాన్ని బట్టి రామారావు అధికారస్థానాన్నీ, అంతస్తునీ ఊహించుకోవచ్చు. కన్ను నుంచి పేలాడే వంకాకూడా ఆయన్ని చూసి బెదిరిపోతున్నట్లుగా చప్పుడు కాకుండా మెల్లిగా తిరుగుతూంది.


"అయ్యా! నిన్న రాత్రి మునిసిపల్ ఛైర్మన్ ముకుందరావుని నేనే హత్య చేశానండి. నన్ను జైల్లో వెయ్యండి. నా అంతట నేనే లొంగిపోతున్నాను" అని జంకూ గొంకూ లేకుండా నిలబడ్డాడు భీమయ్య. పేరుకి భీమయ్యే కాని, ఆకారం సౌమ్యం. సడికారు మనిషి. నెరిసిపోయిన నొక్కుల క్రాపు. వారం రోజులుగా పెరిగిన గడ్డం. కనుబొమల మధ్య ఒక మచ్చ. పసితనంలో చిన్నబిడ్డ గుణం వచ్చినప్పుడు వాళ్ల నాన్న ఆదుర్దాగా చుట్ట కాల్చి చురకవేసిన ముద్ర. ఒకసారి భీమయ్య ముఖం చూసినవాళ్లు ఎంత పెద్ద గుంపులో ఉన్నా అతన్ని ఇట్టే పసికట్టగలరు.

అధికారి రామారావు అతన్ని మరిచిపోకపోవటానికి ఇంకొక బలమైన కారణంకూడా ఉంది. అందుకే భీమయ్య వంక చురచురా చూస్తూ— "నీ కిదొక ఆటగా ఉందే! నిప్పుతో చెలగాటం ఆడటం మంచిది కాదు. ఇంకోసారి ఇలా వచ్చావంటే నిన్ను సూటిగా పిచ్చాసుపత్రికి పంపించేస్తాను. ఇక్కడుంటే అస్తమానం మా ప్రాణాలు తోడేస్తున్నావు" అన్నాడు.

"కాదు, సార్. మీ కాళ్లు పట్టుకుంటాను. నన్ను త్వరగా అరెస్టు చేసెయ్యండి. ఈ హత్య నేనే చేశానండి" అని ప్రాధేయపడుతూ అన్నాడు భీమయ్య.

"నీ ఆటలు నా దగ్గర సాగవురా. ఈసారి జైల్లో వేస్తే ఇక బయట పడటం ఉండదు. అయినా ఈ ఖూనీ చేసింది నువ్వేనని తేలితేకాని నిన్ను జైల్లో పడెయ్యటానికి వీల్లేదు, పో" అని రామారావు కేకలు వేశాడు.

ఇంతలో కొందరు పోలీసులు దర్యాప్తు ముగించుకుని వచ్చారు. అసలు నేరస్థుని ఆచూకీ తీసే విషయంలో తరిఫీదు పొందిన కుక్కల సాయంతో హంతకుణ్ణి గాలించి పట్టుకుని పెడరెక్కలు విరిచి కట్టి తీసుకొచ్చారు. విచారించగా ముకుందరావు హత్యకి కారణం బయట పడింది. ఆ మధ్యనే జరిగిన ఎన్నికల్లో చెలరేగిన తగాదాలూ, పెరిగిపోయిన కక్షలూ చివరికి ఈ విధంగా పరిణమించాయి. ఎన్నికల్లో ఓడిపోయిన పార్టీకి చెందినవాళ్లు ఆ ఊళ్లో పేరు మోసిన ఒక రౌడీకి డబ్బు ఎర చూపించి ఈ



ఖూనీ చేయించినట్లు కూపీ లాగితే తేలి పోయింది.

నిశిరాత్రి ఖూనీ చేసి పారిపోయిన నేరస్థుణ్ణి పట్టుకువచ్చారు.

అధికారి తోక తొక్కిన తాచులాగా బుస కొడుతూ— "ఏం భీమయ్యా! ఊళ్లో ఏ హత్య జరిగినా నేనే హంతకుడి నని తయారవుతావా? ఇదేం తమాషా అనుకున్నావా? ఈసారి నిన్ను పిచ్చాసు పత్రికి పంపెయ్యటం ఖాయం" అన్నాడు.

"నిజంగా నేనే హంతకుణ్ణి. నా మాట వినండి" అని బతిమాలుకున్నాడు భీమయ్య.

"వ్యాపారం దివాలా తీసినప్పటినుంచీ వీడొక దివానా అయాడు, సార్. మతి పోయింది. ఒకప్పుడు బాగా బతికిన వాడండి" అంటూ ఒక జవాను అతన్ని గెంటివేశాడు బయటికి.

"ఇంకోసారి వస్తే తగిన శాస్తి చేస్తాము. గుండు గొరిగించి గాడిదమీద ఊరేగిస్తాము. తిక్క కుదురుస్తాము" అని అధికారి రామారావు చిందులు తొక్కాడు. ఆయనకి అంత కోపం రావటానికి తగిన కారణం ఉంది. మొదటి సారి భీమయ్య మాట నమ్మి జైల్లో వేసినందుకు రామారావుకు గొప్ప అవమానం కలిగింది. పై అధికారుల చేత చివాట్లు తిన్నాడు. కొన్నాళ్ల కిందట సినిమాల్లో చిల్లర వేషాలు ఒకటో, రెండో వేసిన కాంచనలత అనే అమ్మాయిని ఎవరో హత్య చేశారు. తనే హంతకుడినని భీమయ్య వచ్చి లొంగిపోయాడు. దర్యాప్తు జరిపిన తరవాత అసలు సంగతి బయటికి వచ్చింది. ఆ తార కోసం ఇద్దరు ఘర్షణ పడ్డారు. అంతకుముందు మంచి సంబంధం ఉన్న మనిషిని తోసి రాజు చేసి కొత్త నిటుణ్ణి చేరదీసింది కాంచనలత. ఆ కోపంతో మాజీ ప్రేమి కుడు కత్తి కట్టాడు. ద్వేషంగా మారిన మోహం విషసర్పమై కాటు వేసింది. కాంచనలత అభిమానుల్లో భీమయ్యకూడా ఒకడనే మాట నిజమే. కానీ, ఖూనీతో అతని కేమీ సంబంధం లేదు. నలుగురి లోనూ రామారావు తల కొట్టేసినట్లయి పోయింది. తనని గాడిదను చెయ్యటానికే తనకి గిట్టని వాళ్లెవరైనా భీమయ్యకి పురి ఎక్కించి ఈ నాటకం ఆడించా రేమోనని రామారావుకు అనుమానం కలిగింది.

అయినా ప్రతిసారీ ఇదే ఆగడమా? గట్టిగా బుద్ధి చెప్పాలి అనుకున్నాడు రామారావు.

భీమయ్య మటుకు నిశ్చింతగా వెళ్లి పోయాడు. ముఖంలో ఎటువంటి వికారమూ పొడకట్టలేదు. దీన్నిబట్టి అధికారులందరూ వెర్రికి వెయ్యి విధాలు అనే అభిప్రాయం ఏర్పరుచుకున్నారు. ఇంకోసారి ఇలాచేస్తే తప్పకుండా ఆస్పత్రికి పంపించేందుకు నిర్ణయించు కున్నాడు రామారావు.

* * *

పగబట్టిన నాగుపాము భీమయ్య!

ఆ ఊళ్లోనే మూడంతస్తుల మేడలో గుమ్మడికాయంత బొజ్జ పెంచి కులుకు తున్న భూషయ్యా, తనూ చిన్నప్పుడు వీధిబళ్లో కలిసి చదువుకున్నారు. ఈనాడు తన కాపురం పూరిపాకలో ఆముదపు దీపమై పోయింది. ఒకనాటి వైభవాన్ని మరిచిపోలేక, ఈనాటి దీనావస్థకు తట్టుకోలేక భీమయ్య భార్య కుమిలి కుమిలి మంచాన పడి కళ్లు మూసింది— ఒక్క కొడుకు తప్ప నా అన్న వాళ్లెవరూ లేరు. అతని హైస్కూలు చదువు ముగిసేసరికే బండి బోల్తా పడిపోయింది. భాగ్యచక్రం తిరిగిపోయింది. తనని ఉద్ధరించేసినట్లు, తన కేదో గొప్ప ఉపకారం ఒరగబెట్టినట్లు తన కొడుకు శేఖరానికి చిన్న గుమాస్తా ఉద్యోగం ఇచ్చాడు భూషయ్య. ఒకప్పుడు తన పంచన చేరి తన సాయంతో పైకి వచ్చాడు భూషయ్య. యుద్ధకాలంలో తనని వ్యాపారంలోకి దించాడు. నష్టం వచ్చినట్లు చూపించాడు. తనచేత తాతల నాటి మాగాణి పొలాలు అమ్మించాడు. పెళ్లాం మెళ్లో పుస్తెలు తప్ప అన్నీ హరించుకుపోయాయి. ఇద్దరూ మునిగి పోతున్నారని భ్రాంతి కలిగించాడు భూషయ్య. చిన్ననాటి స్నేహితుడు కదా అని ప్రాణం ఇచ్చాడు భీమయ్య. చివరికి భీమయ్యను నట్టేట్లో ముంచేసి ఇట్టే గట్టున తేలాడు భూషయ్య. ఇప్పుడు నల్లమర, సినిమాహాలు, పొగాకు వ్యాపారం, అంతస్తుల మేడ... అంతా గారడీలాగా తోస్తుంది.

భాగ్యచక్రం ఇంతలో తిరగబడిపోతుం దని ఎన్నడూ అనుకోలేదు. ఒక గుండెలో అమావాస్య అలుముకుంటే కాని ఇంకో గుండెలో పున్నమి వెన్నెల పూలు విర జిమ్మదు కాబోలు. ఒక కంట్లో కన్నీటి వాన చిందితేకాని ఇంకొక ఇంట్లో పన్నీటి జల్లు చిలకరించదు కాబోలు!

అప్పటినుంచీ భీమయ్య వింతగా మారిపోయాడు. అతని మనసులో ఏముందో ఎవరికీ తెలియదు. ఇప్పుడు కారులో వెళుతూ భూషయ్య కన్నెత్తి అయినా చూడడు. పోంగా పోయే అతని కారు చక్రాలు రేపిన ఎర్రని దుమ్ము మాత్రం భీమయ్య ముఖానికి రక్తచందన రజం చిమ్మినట్లుంటుంది. అటువంటి విశ్వాసఘాతకుడి దగ్గిర తన ఏకైక పుత్రుడు ఊడిగం చెయ్యవలసిన దుస్థితి పట్టినందుకు కడుపు మండిపోయింది. కాని, ఏం చెయ్యటం? కాలం, కర్మం కలిసి వచ్చేదాకా ఓపిక పట్టాలి. ఒకసారి భూషయ్య దగ్గరికి వెళ్లి కొడుకును కాలేజీ చదువుకు పంపిస్తాను, ఒక రెండు వేల రూపాయలు అప్పు ఇమ్మని అడిగాడు. సోఫాలో కూర్చుని పైపు పీలుస్తున్న భూషయ్య ఎదురుగా సోఫా ఖాళీగా ఉన్నప్పటికీ భీమయ్యని కూచోమనలేదు. "ఏమిటీ? రెండు వేలు అప్పా? నీకా?" అని బిగ్గరగా, వెటకారంగా నవ్వాడు. ఆ నవ్వు భీమయ్య గుండెలను రివాల్వరు గుళ్లతో కొట్టినట్లుగా తూట్లు పడే సింది. కడుపు మండిపోయింది ఆ హేళనతో. 'కాని, కాలం వస్తే పైసంచ కూడా పాముగా మారి కరుస్తుంది కదా!' అని తమాయించుకుని వెళ్లిపోయాడు. అప్పటినుంచి భూషయ్య ముఖం చూడలేదు. అతని గడప తొక్కలేదు. దారం తెగిన గాలిపటంలాగా అయి పోయాడు. ఎక్కడ ఉంటాడో, ఎప్పుడు తింటాడో, ఎలా కాలం గడుపుతాడో ఎవరికీ తెలియదు. కన్న కొడుకుని మాత్రం రోజు కొకసారైనా కళ్లారా చూసుకుని కడుపులో మంట చల్లార్చు కుంటాడు. అప్పటినుంచీ ఏ మూల ఏ హత్య జరిగినా తనే హంతకుడినని పోలీసుల దగ్గరికి వెళ్లి లొంగిపోతాడు. ఈ వింత ప్రవర్తనకు అతని మతి చాంచల్యమే కారణమేమో ఎవరికీ తెలియదు. భీమయ్య అంతరంగంలో ఏమున్నదో ఆ అంతర్యామికే తెలియాలి.

**కక్షలూ, ద్వేషాలూ ప్రేమ ముందు బలాదురు కావల సిందే. ప్రేమించిన పడుచు కోసం కారుచీకట్లో కాంతి రేఖలు పండించుకోవడానికి ఒకడు తెగిస్తే, జీవితాన్ని నరకప్రాయం చేశాడన్న కక్షను గుండెల్లో కాష్టంగా పేర్చుకొని నిప్పులు చెరుగు తూంటే — పిచ్చి లోకపు ఆలోచనలు గింగిరాలు కొట్టడం సహజమే. ఇటు వంటి సమయంలో ద్వేషంగా మారిన మోహం విషసర్పమై కరాళ నృత్యం చేస్తే భరిం చడం సాధ్యమా?**

* * *

ఆ వార్త వినగానే పట్టణమంతా అట్టుడికి పోయింది. భూషయ్య రోజూ రాత్రి పడుకోబోయే ముందు గ్లాసెడు పాలు తాగేవాడట. ఆ రాత్రి పాలగ్లాసు పట్టుకుని తండ్రి గదిలోకి వెళ్లిన మాలతి ఆ భయంకర దృశ్యం చూసి కళ్లు తిరిగి పోయి "నాన్నా!" అని కేక వేసి మూర్ఛపడిందట.

తోటమాలీ, నౌకరూ, వంటమనిషి అంతా కేక వినగానే బిలబిలా వచ్చారు. తోటలో సంపెంగపొద చాటున పొంచి ఉన్న శేఖరాన్ని పట్టుకున్నారు. వెంటనే పోలీసులకు కబురంపారు.

అంత చీకట్లో ఆ తోటలో నక్కి కూర్చున్నందుకు శేఖరం మీదనే అందరికీ అనుమానం కలిగింది. కాని, హత్య చేసిన వాడు పారిపోకుండా ఎందుకుంటాడనే సందేహం ఒక వంక పీడిస్తూంది. ఆయుధాలేమీ లేవు. చేతులకీ, గుడ్డల మీదా ఒక్క నెత్తురు మరకకూడా కనిపించలేదు. అయినా ఆ వేళప్పుడు శేఖరం అక్కడికి ఎందుకు రావాలనే అందరికీ ప్రశ్న.

దానికి కారణం ఏమిటో బహిరంగంగా చెప్పగల ధైర్యసాహసాలు మాలతికి లేవు. కొంత కాలంనుంచీ తనకూ, శేఖరానికీ మధ్య నడుస్తున్న కథను బయట పెట్ట టానికి మనసొప్పలేదు. సంపెంగ పొద వాళ్ల రహస్య సమావేశాలకి మౌనసాక్షిగా ఉన్న సంగతి ఎవరికీ తెలియదు. అంత చీకట్లో తను అక్కడికి వచ్చిన కారణం బయటపెడితే మాలతి నలుగురి నోళ్ల లోనూ పడిపోతుంది. తనకి మనసిచ్చిన మాలతిని అపవాదులకూ, అవమానాలకూ గురిచేయటం కంటే ద్రోహం మరొకటి ఉండదు. ఎవరెన్ని రకాల ప్రశ్నల శూలా లతో గుచ్చినా శేఖరం ఉలకలేదు, పలక లేదు. చలించని శిలాప్రతిమలాగా నిలబడ్డాడు.

ఆ రోజు సాయంకాలం ఆఫీసులో భూషయ్య గుమాస్తా లందరి ముందూ శేఖరాన్ని అనవసరంగా మాటలు మిగిలాడు- 'నీకు పని చేతకాదు. సోమరిపోతువి. నీకు

(తరువాయి 39 వ పేజీలో)

# అపూర్వ రహస్యం

(35 వ పేజీ తరువాయి)

ఇచ్చే జీతం దండగ' అని దురుసుగా అనేశాడు. అవమానం భరించలేక పోయాడు శేఖరం. అభిమానం చంపుకో లేకపోయాడు. అప్పటికప్పుడే నిలుచున్న పళాన ఉద్యోగానికి రాజీనామా ఇచ్చే శాడు. "ఏం చూసుకునిరా నీ కింత తల పొగరు?" అని భూషయ్య హుంక రించాడు. "ఇంత విశాల ప్రపంచంలో బతకలేకపోను లేవయ్యా!" అనేసి శేఖరం బయటికి వెళ్ళిపోయాడు. శేఖరాన్ని తమ నాయకుడుగా గౌరవించే కూలీలందరూ పని ఆపేసి సమ్మె మొదలుపెట్టారు. శేఖరం మీద అనుమానానికి ఈ సంఘటన మరింత బలం కలిగించింది. వెంటనే సంకెళ్ళు వేసి శేఖరాన్ని పోలీసు స్టేషనుకు తీసుకెళ్ళారు.

మర్నాడు తెల్లారేసరికి మామూలుగా భీమయ్య స్టేషనుకి వెళ్ళాడు. "బాబూ! నేనే హంతకుణ్ణి" అని అధికారి రామారావు ముందు నిలబడ్డాడు.

"మళ్ళీ వచ్చావూ?" అంటూ కుర్చీ లోంచి ఒక్క దూకు దూకి జుట్టు పట్టుకుని భీమయ్య చెంపలు వాయించి, సంకెళ్ళు వేయించి ఎండలో నిలబెట్టించాడు రామారావు.

"నిజం, సార్! నా మాట నమ్మకపోతే నే నేం చెయ్యను?" అని భీమయ్య గొణుక్కున్నాడు.

పక్కనే ఉన్న చీకటి గదిలోంచి— "కొట్టకండి. చంపెయ్యకండి. నిజం చెబుతున్నాను. నేను నిర్దోషిని" అనే అరుపులూ, ఏడుపులూ వినిపించాయి. పశువుని బాదినట్లు కొట్టే దెబ్బలు ధనాధనా మోగుతున్నాయి. ఆ కంఠం చాలా పరిచితంగా తోచి, ఎవరా అని భీమయ్య ఆశ్చర్యపడ్డాడు.

ఇంతలో ముక్కులోంచి నెత్తురు కారిపోతున్న ఒక మనిషిని తీసుకొచ్చి అధికారి ముందు పడేశారు. అతడు ఆపాదమస్తకమూ గజగజలాడిపోతున్నాడు. గుడ్డలన్నీ ఎర్రటి డాగులు పడి పూచిన తంగేడుల్లాగా కనిపించాడు. ఎవరూ? కళ్ళు పెద్దవి చేసి చూశాడు. అనుమానం లేదు. తన కొడుకు శేఖరమే!

"బాబూ!" అని అరుద్దామంటే భీమయ్య గొంతు పెగలలేదు. కళ్ళు తిరిగిపోతున్నాయి—కాళ్ళు పట్టు తప్పిపోతున్నాయి. పాదాల కింద నేల రసాతలానికి అణగారిపోతున్నట్లనిపిస్తూంది. పడిపోతానేమోననే భయంతో పక్కనున్న వేపచెట్టుకి ఆనుకున్నాడు.

శేఖరం ముఖాన నీళ్ళు జల్లి, మంచి నీళ్ళు తాగించి మళ్ళీ దారుణంగా కొట్టడం మొదలుపెట్టారు. చెయ్యని నేరం కోసం చిత్రహింసకు గురి అవుతున్న కన్నకొడుకుని చూస్తూంటే భీమయ్య కడుపు తరుక్కుపోతూంది. ఇన్నేళ్ళనుంచీ తను వేసిన పథకం అంతా తారుమారైపోయింది. తను పన్నిన వలలో చివరికి నిర్దోషి అయిన తన శేఖరమే చిక్కుకుపోయాడు. చెయ్యని నేరానికి మొయ్యలేని శిక్ష వాడిమీద పడుతూంది. భీమయ్య తల గిర్రున తిరిగిపోతూంది. మానవుల అంచనాలనూ, పథకాలనూ వమ్ము చేయగల ప్రబల శక్తి ఎక్కడో చాటునుంచి తనని వెక్కిరిస్తున్నట్లు తోచింది. తన పన్నాగం విజయవంతంగా కొనసాగించానని మురిసిపోయే సమయంలో అనుకోని విధంగా అంతా అడ్డం తిరిగిపోయింది.

"బాబూ! వాణ్ణి చంపకండి. ఈ సారి నా మాట నమ్మండి. నిజంగా హత్య చేసింది నేనే! వాడు ఏ పాపమూ ఎరగడు" అని అధికారి కాళ్ళమీద పడ్డాడు భీమయ్య. నాడాలు వేసిన బూట్ల కాలు పైకెత్తి భీమయ్య ముఖాన తన్నబోయిన రామారావు ఆ నిర్భాగ్యుడి కళ్ళలో తొణికే బాష్పబిందువులు చూసి తమాయించుకున్నాడు.

"నిజం చెబుతున్నాను. నా మూలంగా ఈ నిర్దోషి ప్రాణం తీసేట్లున్నారు. ఈ హత్య చేసింది నేనే. దీని కోసం నేను పదేళ్ళ నించీ కలవరిస్తూ అదును కోసం కాచుకున్నాను. హత్య చేసినప్పుడు నా మీద ఎవరికీ అనుమానం కలగకూడదని ఆశపడ్డాను. అందుకోసమే ఎక్కడ హత్య జరిగినా నేరం నా నెత్తిన వేసుకునే వాణ్ణి. నిజంగా హత్య చేసినప్పుడుకూడా ఎప్పటిలాగే వచ్చి నేనే చేశానని చెబితే పిచ్చివాడని చెప్పి వదిలేస్తారనీ, ఆ నేరం ఇంకెవరి మీదనో పోతుందనీ అనుకున్నాను. ఇలా జరుగుతుందని తలపోయలేదు. నేను వేసిన పథకం నా కన్నకొడుక్కే ప్రాణాంతకం అవుతుందని అనుకోలేదు, సార్!" అంటూ రామారావు పాదాలను సంకెళ్ళ చేతులతో పట్టుకున్నాడు భీమయ్య.

"నిజంగా నువ్వే చేశావా, నాన్నా!" అని శేఖరం ఆవురుమన్నాడు.

"నేనే. ముమ్మాటికీ నేనే. నన్ను సర్వనాశనం చేసిన ఆ దుర్మార్గుణ్ణి తుదముట్టించాను. నా కడుపుమంట ఈవేళ చల్లారింది. మీకు అనుమానంగా ఉంటే ఊరి బయట పాడుబడిన శివాలయం దగ్గిర రావిచెట్టు తొర్రలో నెత్తురుతో తడిసిన గుడ్డలూ, కత్తీ దాచి వచ్చాను. వెళ్ళి చూసుకోండి. నన్ను జైలుకి వెంటనే పంపండి. ఉరి తీయండి. నా కన్నతండ్రి శేఖర్‌ని మాత్రం విడిచిపెట్టండి. వాడు నిరపరాధి" అని గద్గద స్వరంతో అన్నాడు భీమయ్య.

అధికారి అంతా విని ఆశ్చర్యంలో మునిగిపోయాడు.

"బాబూ! అంత చీకట్లో ఆ భూషిగాడి ఇంటి కెందు కెళ్ళావురా?" అని బుజ్జగింపుగా అన్నాడు తండ్రి. శేఖరం తల వంచుకుని నోరు మెదపలేదు.

"చెప్పవేరా, నాయనా? ఎన్ని దెబ్బలు తిన్నావురా, నా తండ్రీ?" అని గడ్డం పుచ్చుకుని లాలిస్తూ అడిగాడు భీమయ్య.

లాఠీదెబ్బలు బయటికి లాగలేని సత్యం ఆ క్షణంలో శేఖరం హృదయంలోంచి ఉబికి వచ్చింది తండ్రి లాలింపుతో.

"మాలతి కోసం. నిన్న రాత్రే మే మిద్దరం ఎక్కడికైనా పారిపోయి రహస్యంగా పెళ్ళి చేసుకుందామని అనుకున్నాం" అన్నాడు శేఖరం.

"సిగ్గు లేదూ? మనల్ని సర్వనాశనం చేసిన ఆ దుర్మార్గుడి కూతురిని పెళ్ళాడుతావా? ఛీ!" అని దెబ్బ తిన్న బెబ్బులి లాగా గాండ్రించాడు భీమయ్య. ఆ కేక విని అధికారికూడా అదిరిపడ్డాడు. శేఖరం సామ్రాజ్యాన్ని కోల్పోయిన చక్రవర్తి లాగా వంచిన తల ఎత్తకుండా నిట్టూరుస్తూ నిలబడ్డాడు.

కొన్ని క్షణాలు గడిచేసరికే భీమయ్య గుక్క తిప్పుకుని శేఖరం తల నిమురుతూ—

"నీ ఇష్టం వచ్చినట్లే కానీ, బాబూ! చూడు, ఈ లోకం ఎంత విచిత్రమైనదో! పట్టుబడకుండా హత్య చెయ్యాలని కలవరించి చివరికి నా అంతట నేనే దొరికిపోయాను. ప్రబల శత్రువుగా నేను ద్వేషించి హతమార్చిన భూషయ్య కూతురునే నువ్వు ప్రేమించి పెళ్ళి చేసుకుంటా నంటున్నావు. అనుకున్న దొకటీ, జరిగేది మరొకటీ. మన అంచనాలన్నిటినీ చిత్తు చేసే కనపడని శక్తి ఏదో ఉందిరా, తండ్రీ? నీ ఇష్టమే నా ఇష్టం. నీ ఆనందమే నా ఆనందం. నా దేముంది? వెళ్ళిపోతున్నాను. ఉరికంబం పిలుపుకోసం కనిపెట్టుకున్నాను" అన్నాడు.

"నాన్నా!" అని శేఖరం బిగ్గరగా ఏడ్చాడు.

"ఊరుకో, బాబూ! ఇది విచారానికి సమయం కాదు. ఈవేళ నా మన సెంతో ఆనందంతో పొంగిపోతోంది. నా శత్రువుని కడతేర్చాననే సంతోషంతో కాదురా. ఈవేళ ఒక గొప్ప నిజం నా కళ్ళలో మెరిసిందిరా! అందుకే ఆనందంతో తేలిపోతున్నాను."

"ఏమిటా నిజం? చెప్పవా, నాన్నా?"

"ఈ లోకంలో రోషాలూ ద్వేషాలూ కలకాలం నిలవవన్న నిజం ఈవేళ తెలుసుకున్నాను, బాబూ! కలకాలం ఈ లోకంలో నిలిచేది ఒక్కటేరా, శేఖర్?"

"ఏమిటి, నాన్నా?"

"ఏమిటా? ప్రేమ ఒక్కటేరా! అబద్ధాలకు అలవాటు పడిన నా నాలుకతో ఈవేళ నిజం పలికించింది. ఎన్ని దెబ్బలు తిన్నా నిజాన్ని నీ లోపలే దాచుకునేట్లు చేసింది. దాని ముందర పగ అనే పడగ ముడుచుకోవలసిందేరా!" అంటూంటే భీమయ్య కంఠం వణికి, కన్నీళ్ళతో చెక్కిళ్ళు తడిసిపోయాయి.

ఇంతలో—"చెప్పినచోటే దొరికినాయి, సార్" అంటూ పోలీసులు కత్తినీ, నెత్తురుతో తడిసిన గుడ్డల్నీ పట్టుకొచ్చి అధికారిముందు పడేశారు.

"ఇప్పుడైనా నా మాట నమ్ముతారా" అని భీమయ్య అధికారి వైపు తిరిగాడు.

"చాలా చిత్రమైన కేసు!" అంటూ అధికారి కుర్చీలోంచి లేచాడు.

తండ్రి వంక ఆశ్చర్యంగా చూస్తూ నిలబడిపోయాడు శేఖరం. ఏ మనసు పుట్టలో ఏ పాము బుస లున్నాయో ఎవ రెరుగుదురు?

ఏమైనా నేను మాత్రం ఆగకుండా సాగిపోతాననుటున్నది, గోడమీద గడియారంలో టక్‌టక్ మనే ధ్వనులతో, కళ్ళకు కనపడని కాలవిహంగం. ✱

భగవంతుడు అప్పుడప్పుడు మనకు కనిపించని రూపంలో మనల్ని చూడడానికి వస్తుంటాడు. మన నడవడికను గమనిస్తుంటాడు మనం చేసే పనులను లెక్క వ్రాసుకుని పోతుంటాడు.

—మిల్టన్